


(22 వ భాగము)

మేలుకునే వున్నాను. గదిలోనూ, వెలుపలా నిశ్శబ్దంగా వుంది. ప్రకృతి ప్రశాంతంగా నిద్రపోతున్నట్లు వుంది.

ఉన్నట్టుండి, నా గది ముందున్న వరండాలోనూ, క్రిందా మనుషులు హడావిడిగా, పెద్దపెద్దగా అరచుకుంటూ పరుగెత్తుతున్నట్లు పసిగట్టాను.

ఏమయివుంటుందాని క్షణం ఆలోచించాను.

వాళ్ళు చేస్తున్న రిసెర్చికి సంబంధించిన విషయమయి వుండాలనుకొన్నాను ముందు. ఆ తర్వాత డెల్లా గుర్తొచ్చింది. ఆమె ఏదన్నా అఘాయిత్యంగానీ, అర్థంలేని అల్లరి పనికానీ చేసిందేమోననిపించింది. ఆ తలంపు మెదడులోకి రాగానే వెంటనే వెళ్ళి చూసి రావాలనిపించింది.

ఠక్కున లేచాను. మంచంపై నుండి దూకాను క్రిందికి.

తలుపులవద్దకు పరుగెత్తాను. తీశాను. వరండాలోకి అడుగు పెట్టాను. నడుం విరిగిపోయినట్లయింది. కుప్పలా కూలి పోయాను. కాళ్ళు తన్నుకొన్నాయి. చేతులు కొట్టు కున్నాయి. అది నెప్పికాదు. శరీరంలోని నరాల్ని మొత్తాన్ని కలిపి, గుజ్జుచేసి వేసింది.

ఓర్చుకోలేక పెద్దగా అరచాను "డెల్లా!" అని. ఆ వెంటనే మూర్ఛ వచ్చినట్లయింది.

మళ్ళీ కళ్ళు తెరిచేసరికి నాకు చేతులకు బ్లడ్ ఎక్కి స్తున్నారు. తలకు లావుపాటి బాండేజి కట్టినట్లున్నారు. నా కెదురుగా డాక్టర్ డేనియల్ నిలుచుని వున్నాడు. అతనిప్రక్క పొట్టిగా, బొద్దుగా వుండే నర్సు నిలుచు నుంది.

రాత్రి ఏమయిందో తెలుసుకుందామన్న ఉద్దేశ్యంతో అడుగుదామని నోరు తెరవబోయాను.

డాక్టర్ డేనియల్ వద్దని వారించాడు.

నా ప్రయత్నం విరమించుకున్నాను. కానీ మనసు మాత్రం తెగ మథన పడిపోసాగింది.

డాక్టర్ గదిలోంచి వెళ్ళిపోయాడు.

నర్సు స్టాండుకున్న క్లిప్స్ సర్దుతూ నిలుచుంది. ఆమె కేసి చూశాను. ముభావంగా వుంది.

దాహంగా వుందని చేత్తో సంజ్ఞ చేసి చెప్పాను.

గ్లూకోజ్ వాటర్ తెచ్చి స్పూనుతో రెండుసార్లు పెదాలపైన పెట్టి పోసింది. గుటక వేశాను.

అమెరికన్ నర్స్ లేదా అని మళ్ళీ చేత్తోనే సంజ్ఞ చేసి అడిగాను. నిద్రపోతుందని చెప్పింది. డెల్లాను గురించి అడగాలనుకున్నాను. ఎలా చెప్పినా ఆమెకు అర్థంకాదు.

డాక్టర్ నన్ను మాట్లాడ వద్దని మరీమరీ వారించి వెళ్ళి వుండటంతో ఆ కోరిక అణచుకున్నాను.

ఐదు నిముషాలు నిలబడింది. బాటల్ లోవున్న బ్లడ్ మొత్తం నా శరీరంలోకి ఎక్కిపోయిందని, నిర్ధారించుకొని, అవన్నీ తీసి మూలగాపెట్టి, నన్ను విశ్రాంతి తీసుకోమని చెప్పి, తలుపులు దగ్గరకు లాగి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళాక నిద్రపోవాలని చాలాసేపు ప్రయత్నించాను. కళ్ళు మూతపడలేదు. రాత్రి జరిగిన సంఘటనలే గుర్తుకు రాసాగాయి. అసలు అంతమందీ హడావిడిగా ఎందుకు పరుగెత్తిందీ తెలిసేదాకా నాకు మనశ్శాంతి చిక్కేట్లు లేదు.

మేలుకునే వున్నాను రాత్రంతా.

నాకు తెలిసే తెల్లవారింది. కిటికీగుండా సూర్యకిరణాలు పడటం గదిని కొద్దిగా వేడిక్కించడం కూడా గమనిస్తూనే వున్నాను.

డాక్టర్ డేవియల్ వచ్చాడు. చకచక ఏవేవో పరీక్షలు చేశాడు.

"రాత్రేమయింది డాక్టర్?" అడిగాను.

"ఏమయిందనుకొని అంత మొండిగా లేచి పరుగెత్తాలని ప్రయత్నించావ్?" అడిగాడు డేవియల్ నన్ను.

"ఏదో ప్రమాదం జరిగినట్లనిపించింది" అన్నాను.

"ఎవరికి?"

మాట్లాడకుండా మౌనంగా వుండిపోయాను.

"నీ భార్య కనుకున్నావు కదూ!" అడిగాడు డాక్టర్.

"అవును. అందుకే అలా సాహసం చేశాను" అసలు

నిజం ఆయన ముందు నిర్మొహమాటంగా ఒప్పుకున్నాను.

"ఆమెకేం కాలేదు. షి ఈజ్ ఆల్ రైట్. ఆమె గురించి నువ్వే విధమైన ఆత్రుత పెట్టుకోవద్దు. ఆమెకోసమైనా నువ్వు మాతో కోపరేట్ చెయ్యి. నీ ఆరోగ్యం కుదుటబరచే బాధ్యత మామీద వుంచు. మేము చెప్పినట్లు చెయ్యి" అన్నాడు డేనియల్ సిన్సియర్‌గా.

"అలాగే. అసలు ఏమయింది డాక్టర్"మళ్ళీ అడిగాను.

"క్రింది అంతస్తులో ఏదో ఫైర్ ఏక్సిడెంటు అయింది. అందుకని అందరం పరుగెత్తాం. అక్కడ చాలా ఖరీదైన మెషిన్లు తెచ్చి పెట్టారట. పరిశోధనకు అవి చాలా ముఖ్యమట" అన్నాడు డాక్టరు.

"అలాగా! సారీసార్! తొందరపడ్డాను" అన్నాను.

డాక్టర్ వెళ్ళిపోయాడు.

నాకు ఆనందంగా వుంది. అనవసరంగా కంగారుపడిపోయి నన్ను నేనే చంపుకునేంత తెలివి తక్కువగా సాహసం చేసినందుకు సిగ్గుపడ్డాను. ఇంతమంది శాస్త్రజ్ఞులుండి కూడా, తెచ్చుకున్న మెషిన్లు ముఖ్యమయినవని తెలిసే, అజాగ్రత్తగా ఎలా వదుల్తారో అర్థం కాలేదు. అయినా అది నాకు అవసరం లేని విషయం.

ఆ విషయం గురించి అందుకే ఆలోచించడం మానివేశాను. పదిగంటల ప్రాంతంలో అమెరికన్ నర్స్ వచ్చింది. దగ్గరగా వొంగి ఇంజక్షను చేస్తుంటే చూశాను ఆమె కళ్ళవేపు. ఎర్రగా వున్నాయి. బాగా వాచినట్లు ఉబ్బి వున్నాయి.

సిరంజితీసి బాక్స్‌లో వేసి, ఏదో మందు గ్లాసులో పోసి నోటిదగ్గర పెట్టింది. త్రాగాను. జేబు రుమాలుతో మూతి తుడిచింది.

"రాత్రి నిద్రలేదా?" అడిగాను.

"ఏం?" అడిగింది సీసా మూత ఘట్టిగా బిగిస్తూ.

"కళ్ళు వాచివుంటేనూ..." అన్నాను.

"అవును నిద్రలేదు" అంది. ఆమె సమాధానాలు నన్ను ఆశ్చర్యపరచాయి.

"ఆక్సిడెంట్ జరిగినప్పుడు నువ్వు కూడా పరుగెత్తి పోయావా?"

"ఆఁ! అక్కడే చాలాసేపు వున్నాను."

"మెషిన్లు బాగా డేమేజి అయినాయా?" అడిగాను.

"ఏం మిషిన్లు?" అడిగిందామె.

"నీకు తెలీదా? క్రింది అంతస్తులో పెట్టిన మిషన్లు!" అన్నాను.

ఆమె ఏదో మరచిపోయినట్లుగా "అవా? ఆఁ! బాగానే చెడిపోయాయి. అయినా రిపేరు చేసుకొంటే పనిచేస్తాయనుకుంటున్నారు. వస్తాను!" అంది బైలుదేరుతూ.

"రాత్రి నేనూ సాహసం చేశాను. చెప్పారా?" అడిగాను.

"ఆఁ! విన్నాను" అంది వెళ్తూ.

ఆమె ఆ విషయం గురించి ప్రస్తావించక పోవడం నన్ను తికమక పెట్టింది. మెషిన్ల గురించి అడిగినప్పుడు తెలియనట్లే వుండి తర్వాతేదో మరచిపోయినట్లు గుర్తుకు తెచ్చుకుని మాట్లాడింది. అంతమంది క్రింద వుండగా ఈమె వెళ్ళి నిద్రలేకుండా అంతసేపు ఎందుకుండవలసి వచ్చిందో అర్థంగాలేదు.

రెండో నర్సు మొఖం గుర్తు చేసుకున్నాను. కడిగిన ముత్యంలా వుంది. నిద్ర బాగా పోయినట్లు, కావలసినంత

రెస్టు తీసుకొన్నట్లు చూడగానే అనిపించింది నాకు. మరి ఇద్దరిలో ఇంత తేడా ఎందుకుంది?

గంట తర్వాత వచ్చి, రొట్టె తినిపించింది. పాలు అందించింది త్రాగమని నాపైకల్లా వంగి. ఆమె గౌను కాస్త క్రిందికి జారింది. త్రాగుతూనే గౌన్లోకి చూచాను. అందమైన బంతుల్లాంటి రొమ్ములు, రోజారంగు నిపుల్స్‌తో కనుపించాయి. వాటిని చూచి నాకు ఆవేశం కలగలేదు. ఆమెపైనున్న అభిమానం వల్లనా? లేక నాకు జరిగిన అక్సిడెంటులో ఇక జీవితంలో ఆడవాళ్ళను చూచి ఆవేశ పడే అదృష్టం పోగొట్టుకొన్నానా అర్థంకాలేదు.

సిస్టర్ లేచింది. గ్లాసు కడిగి స్టూల్‌పైన పెట్టింది, రెండు మాత్రలు తెచ్చి నా గొంతులో వేసింది. నీళ్ళు త్రాగించింది.

"సిస్టర్!" పిలిచాను.

ఆమె నావైపు చూచి, నిలుచుంది దగ్గరగా.

"నాపైన కోపంగా వుందా?" అడిగాను.

"ఎందుకు?"

"కోపంగా లేకుంటే ఇవాళ చాలా ముభావంగా వున్నావ్. అడిగిన దానికల్లా క్లుప్తంగా జవాబులు చెపుతున్నావ్ ఇంకో నర్సులాగా!" అన్నాను అది నాకు యిష్టం లేదన్న విషయం ఆమెకు అర్థంకావాలని.

"అలాగే వుండాలని అన్నారు!" అంది ఆమె.

"ఎవరు?" అడిగాను.

"డాక్టర్ డేనియల్!"

"ఎందుకని?"

"ఏమో? ఆయనొచ్చినప్పుడు అడుగు. చెప్తారు. నాకేం

తెలీదు!'' అంది ఆమె విసుగ్గా.

''ఓమారు డాక్టర్ డేనియల్‌ని రమ్మని చెప్తావా?''

''ఎందుకూ? ఈ విషయం గురించి అడిగేందుకా?''

''కాదు! నా ఆరోగ్యం గురించి వారినుంచో ముఖ్య విషయం తెలుసుకోవాలి. దయచేసి ఈ చిన్న సాయం చెయ్యి. వెంటనే రమ్మని చెప్పు!'' దీనంగా అడిగాను.

''అలాగే చెప్తాను! కానీ నా విషయం ఆయన్ను అడగనని మాటివ్వండి'' అందామె భయంగా.

''అలాగే!'' అంటూ ఆమె చేతిలో చెయ్యి వేశాను. నా చేతికి వెచ్చగా తగిలాయి అందమైన ఆమె పొడవు పాటి చేతివ్రేళ్ళు.

గదిలోంచి నర్సు వెళ్ళిపోయింది.

ఆమెరికన్ నర్సును నాతో ఎక్కువగా మాట్లాడవద్దనీ, ముభావంగా వుండమనీ డాక్టర్ డేనియల్ ఎందుకు హెచ్చరించవలసి వచ్చి వుంటుంది? నిజానికి ఆయన్ను ఈ వ్యవహారం గురించి అడగాలనే అనుకున్నాను. ఆమెకు మాటిచ్చాక ఆ ప్రయత్నం మానుకున్నాను.

డాక్టర్ డేనియల్ వచ్చారు.

''ఎలా వుంది?'' వస్తూనే ఆత్రుతగా అడిగాడు.

''బాగానే వుంది! కానీ డాక్టర్ నాకు జరిగిన ప్రమాదం వల్ల మగతనం పోవటం లాంటిదేదైనా జరుగుతుందా?'' అడిగాను, గొంతు తగ్గించి చిన్నగా, ఆయనకు మాత్రమే వినిపించేటట్లు.

''అలాంటి ప్రమాదం జరిగిందని నీకెలా తెలిసింది?''

''అనుమానంగా వుంది!'' అన్నాను కళ్ళెత్తకుండా.

''ఎందుకని? నిన్ను సెక్సువల్ ఎక్సైట్ చేసిందెవరు?

కమాన్ టెల్ మీ!'' అరచాడు డేనియల్.

''ఎవ్వరూ చెయ్యలేదు!'' అన్నాను.

''నో! ఐ వోంట్ బి లీవ్ ఇట్! నాకు నిజం చెప్పు'' ఆయన నుదురు చెమట పట్టింది. కళ్ళనిండా ఆత్రుత నిండు కొంది.

చకచక ఆలోచించాను. నర్సును ఇందులో ఇరికించటం నాకు ససేమిరా ఇష్టంలేదు.

''నా వైఫ్ గురించి, రాత్రంతా ఆలోచిస్తూ పడు కున్నాను. అంతకుముందు అలాంటి ఆలోచనలు వచ్చి నప్పుడు ఎక్సైట్మెంట్ పొందేవాణ్ణి! ఈమారు అది జరుగలేదు. అందుకే అనుమానం వచ్చింది. మిమ్మల్ని అడుగుదామని పిలిచాను'' అంటూ బొంకాను.

డాక్టర్ డేనియల్ మొఖంనిండా బిగుసుకుపోయిన కండరాలు కాస్త పట్టు వదిలాయి. ఏదో రిలీఫ్ పొందినట్లు ఫీలయినాడు.

''అలాంటిదేమీ జరుగదు! నీ నరాలు చాలా బల హీనంగా వున్నాయి. అందువల్లే అసలు నువ్వు లేచి కూర్చోలేకుండా వున్నావ్. నాల్రోజులు రెస్ట్ తీసుకొని, మంచి ఆహారం తీసుకుంటే మామూలు మనిషివవుతావ్. అయినా సెక్స్ గురించిన ఆలోచనలు ప్రస్తుతం రానివ్వకు'' అంటూ హితబోధచేసి వెళ్ళిపోయాడు.

మరో మూడురోజులు గడిచిపోయాయి.

కానీ ఆ దీవి పైనంతా హెలికాప్టర్లు విపరీతంగా తిరుగు తూండటం గమనించాను. ఎప్పుడూ వరండాలో అటూ ఇటూ తిరిగే సైంటిస్టులుకూడా ఎవ్వరూ ఎక్కువగా కను పించలేదు,

అమెరికన్ నర్సును అడిగాను. ఆమె తనకేమీ తెలీదంది. మూడోరోజు సాయంత్రం డాక్టర్ డేనియల్ సాయంతో గదిలో అటూ ఇటూ నాలుగడుగులు వేశాను. నడుం కొంత నొప్పి పుట్టింది. కానీ భరించగలిగిన మోతాదులోనే వుందది.

డాక్టరునుకూడా హెలికాప్టర్ గురించి అడిగాను. ఆయనకూడా తనకేమీ తెలీదన్నాడు. డెల్లా గురించి రోజూలాగే అడిగాను. ఆమె ఆరోగ్యం కాస్త కుదుటబడిందని చెప్పాడు. కానీ ఇంకా ఎవర్నీ గుర్తుపట్టడం లేదనీ, పిచ్చిపిచ్చిగా మాట్లాడటం, అరవడం, తల గోడకేసి బాదుకోవటంలాంటి చేష్టలు మాత్రం తగ్గలేదని చెప్పాడు డేనియల్.

మరుసటి దినంకూడా డాక్టరుగారు వచ్చి వాకింగ్ ఎక్సర్‌సయిజు చేయించారు. ఇంకో నాలుగు అడుగులు ఎక్కువగా వేశాను. ఏమాత్రం నొప్పి తెలీలేదు.

"నన్ను డెల్లాదగ్గరకు తీసుకెళ్తారా?" అడిగాను డాక్టర్ను.

"ఇవాళ కాదు! ఆమె క్రింది అంతస్తులో వుంది. మెట్లు దిగలేవు నువ్వు! రెండ్రోజులాగాలి. ఆతర్వాత నా సాయం, అనుమతి లేకుండా నువ్వే నడచి వెళ్తావు" అన్నాడు డేనియల్.

ఇంకేం మాట్లాడకుండా మౌనంగా వుండిపోయాను. ఆయన చెప్పిన రెండురోజుల గడువుకూడా ముగిసింది. అన్నట్టే బాగా నడవగలిగాను. వరండాలో దాదాపు ఇరవై గజాలు పైనే నడిచాను. మెట్లు దిగే లోడింగ్ దగ్గరకు రాగానే "క్రిందికి వెళ్ళొద్దాం!" అన్నాను.

"వద్దు! ఇవాళ కాదు! రేపు తీసుకెళ్తాను. నువ్వు దిగ బోయే ముందు నీకు కొన్ని ముఖ్యమయిన విషయాలు చెప్పాలి! అవి విన్నతర్వాత మాత్రమే నువ్వు దిగేందుకు అనుమతి నిస్తాను" అన్నాడు డేనియల్.

"చెప్పండి!" అన్నాను ధైర్యం తెచ్చుకుని.

"ఇప్పుడు కాదు. రేపు ఉదయం చెప్తాను" అన్నాడు డేనియల్. ఆ రోజుకూడా హెలికాప్టర్ తిరుగుతూనే వుంది.

ఆ రాత్రంతా కంటిపైన కునుకు పడలేదు. మేలుకునే ఆలోచిస్తూ వుండిపోయాను. అంత ముఖ్యంగా డాక్టరు నాతో మాట్లాడవలసిన విషయాలు ఏమై వుంటాయని ఆశ్చర్యపోయాను కూడా. నా ఆరోగ్యం గురించి, తీసుకో వలసిన జాగ్రత్తలు ఏకరువు పెట్టేందుకు బహుశా అలా చెప్పివుంటా డనుకున్నాను.

ఒక రాత్రప్పుడు, క్రిందికి వెళ్ళి డెల్లాను చూసొద్దా మనుకున్నాను. తీరా డాక్టర్ నన్ను చూడటం జరిగితే ఆయన్ను చిన్నబుచ్చిన ట్లుంటుందేమోనన్న ఆలోచనతో ఆ ప్రయత్నం మానుకున్నాను.

ఉదయంకోసం నేనూ, నా హృదయం ఆ రాత్రంతా ఆరాటంతో ఎదురుచూడసాగాం. నింపాదిగా తెల్లవారింది. డాక్టర్ గారి రాకకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను.

నర్సు వచ్చింది. మామూలుగానే తను చేసే పనులు చేసుకుని వెళ్ళింది. ఆ తర్వాత అరగంటకు డేనియల్ వచ్చాడు.

రాగానే నన్ను మంచం దిగి కాసేపు గదిలో పచార్లు చెయ్యమన్నాడు. కాళ్ళు ఒకదానితర్వాత ఒకటి గాలి

లోకి పైకెత్తి విదిలించమన్నాడు. అలాంటివే నాలుగైదు ఎక్సర్‌సయిజులు చేయించాడు. అంతా అయ్యాక కుర్చీలో జేరబడుతూ "నువ్వు పూర్తిగా కోలుకున్నట్లే!" అన్నాడు.

"థాంక్స్!" అన్నాను.

"కొద్దిదినాలు నువ్వు బరువులు మోయటం గానీ, ఎక్కువ నడవటంగానీ పనికిరాదు. వేళకు సరైన ఆహారం తీసుకోవడంకూడా ఎంతో అవసరం" డేనియల్ అలాగే ఏవేవో చెప్పుకుపోసాగాడు.

నేనన్నీ మనసు వాటిపై నిలపకుండా వింటున్నట్లు నటిస్తూ "ఊఁ" కొట్టసాగాను. నేను ఎదురుచూస్తున్న విషయం ఆయన ఎంతకూ ప్రస్తావించడం లేదు.

ఇక లాభంలేదని నేనే అడిగాను "డెల్లా గురించి చెప్తామన్నారు!" అంటూ.

"అవును! చెప్పాలి!" అంటూ కుర్చీలో సర్దుకుని కూర్చున్నాడు.

"మీ రిద్దరూ ఇసుకమేట క్రింద, ఒకే లోతులో, ఒకే విధమైన వాతావరణ పరిస్థితుల మధ్య పూడుకుపోయారు. కానీ ఆమెకు ఊపిరితిత్తుల్లో అంతకు ముందునుంచే ఇన్‌ఫెక్షను వుండి వున్నట్లుంది. ఊపిరాడక నీకన్నా ముందే స్పృహ కోల్పోయివుండాలి. మేము ఆమెను వెలికి తీసే సరికి ప్రాణాలు పోవటానికి చాలా దగ్గరలో వుంది ఆమె స్థితి. ఆమెను త్వరత్వరగా ఈ బిల్డింగుకు చేర్చాం. ఆక్సిజన్ ఇచ్చాం. దాంతో ప్రాణం నిలబడింది. కానీ, ఆక్సిజన్ ఆమె మెదడును దెబ్బతీసింది. అది మాకే విచిత్రంగా వుంది. ఆ తర్వాత పిచ్చిదయిపోయింది. ఇక్కడున్నవాళ్ళందర్నీ తన్నిందే. తలుపులు ఊడబీకింది. కుర్చీలు, బల్లలు

తలక్రిందులు చేసింది. మందుసీసాలు కిటికీలగుండా విసిరి వేసింది'' ఆగాడు డేనియల్.

"ఆమె సహజంగా చాలా ధైర్యస్థురాలు!'' అన్నాను.

"ఆమె అల్లరి భరించలేక కాళ్ళు చేతులూ కట్టివేశాం. అలాగే ఆమెకు చికిత్స చెయ్యడం ప్రారంభించాం. ఈ మధ్య అంటే నాలుగురోజుల క్రితం, ఒక అర్ధరాత్రిపూట ఆమె కట్లు తెంచుకుంది. ఎవ్వరికీ తెలీకుండా, మా కన్ను కప్పి వెళ్ళిపోయింది. ఆ రాత్రి మేమంతా హడావుడి పడ్డాం. ఆమెకోసం ఈ దీవి మొత్తం గాలించాం. కనుపించలేదు. చివరకు హెలికాప్టరుకూడా తెప్పించి, వెతికే ఏర్పాట్లు చేశాం!'' చెప్పి డాక్టర్ నాకేసి చూశాడు.

"ఆమె కనుపించిందా?'' అడిగాను. నాకు తెలీకుండానే, పగిలిన నా గుండెల్లోంచి కారుతున్న రక్తం, నీళ్ళుగా మారి కళ్ళను కడిగి, ధారావాహికంగా ప్రవహించ సాగింది.

"కనుపిస్తే నాకు ఎంతో హాయిగా వుండేది! ఇంతదాకా కనుపించలేదు. కానీ మా ప్రయత్నాలు సాగిస్తూనే వున్నాం. ఏ క్షణాన్నయినా ఆమె కనుపించే అవకాశం వుంది!'' అన్నాడు డేనియల్.

నాకు నోట మాట రాలేదు. మెదడు, మనస్సు శూన్యమైపోయాయి. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. ఆలోచించే శక్తికూడా కరువయిపోయినట్లు తోచింది.

"మిస్టర్ రాజ్! బెంబేలుపడకు. ఇలాంటి సందర్భాల్లోనే ధైర్యం చిక్కబట్టుకోవాలి! మేము చెయ్యగలిగినదంతా చేస్తున్నాం. మీ ఇద్దరివల్లా ఈ శాస్త్రజ్ఞుల బృందం తమ పరిశోధనల్లో ఎన్నో గొప్ప విషయాలు

తెలుసుకొంది. ఈ దీవిపై వీచిన విషపుగాలులు మీ శరీరాలపై ఎలా పనిచేసిందీ వారు తెలుసుకోగలిగారు. ప్రపంచంలోని వాతావరణ శాస్త్ర పరిశోధనకి ఈ విషయాలు ఎంతగానో ఉపయోగిస్తాయి. అందుకే నీవు సాయపడాలని మేమంతా కృషి చేస్తున్నాం!" అన్నాడు డేనియల్.

"ఆమె ఎలా తప్పించుకొంది డాక్టర్!" అడిగాను నేను.

"అదే మా కందరికీ అర్థం కావడంలేదు. ఆరోజు కూడా ఆమెను బంధించే వుంచాం. ఆ కట్లు ఆమెకై ఆమే విప్పుకొనే అవకాశం ఏమాత్రం లేదు. కానీ తప్పించుకొని వెళ్ళింది. ఇక్కడున్న అందర్నీ అడిగాం. అందరూ తెలీదని తప్పుకున్నారు" డాక్టరుగారు చెప్పారు.

"ఈ పాటికి ఏదైనా ప్రమాదంలో చిక్కుకుని ప్రాణాలు పోయివుండవచ్చు ఆమెకు. లేకుంటే మీ రెన్నాళ్ళనుండి వెతికినా ఎందుకు కనుపించదు. డాక్టర్! మాకు ప్రాణాలు పోసినందుకు ఎంతో కృతజ్ఞుణ్ణి. నాకు సెలవిప్పించండి. వెళ్ళి నా డెల్లాను వెతుక్కుంటాను" అన్నాను.

"ఎక్కడికని వెళ్తావ్? ఎలా వెతుకుతావ్? అందులోనూ నీ ఆరోగ్యం అంత బాగాకూడా లేదు" అన్నాడు డాక్టర్.

"ఆమె కనుపిస్తే ఆరోగ్యం దానంతటదే బాగవుతుంది. లేకుంటే ఆమెతోపాటు నేనూ పోతాను" అంటూ లేచాను.

డాక్టర్ డేనియల్ అవాక్కయిపోయాడు. ఆయన

కళ్ళలోకి చూశాను. కన్నీరు ధారలు కట్టడం, కళ్ళద్దాల లోంచి కనిపిస్తూనే వుంది.

"మిస్టర్ రాజ్! మావాళ్లు ఎటూ ప్రయత్నిస్తున్నారు. నువ్వూ కావాలంటే వాళ్ళతోనే వెళ్ళి వెతుక్కో. రాత్రి కాగానే వచ్చి రెస్ట్ తీసుకో!" సలహా ఇచ్చాడు డేనియల్.

"అలా లాభంలేదు! నన్ను నా దారిన పోనివ్వండి!" అన్నాను మంకుపట్టుతో.

"దెన్ ఓ. కే! గాడ్ విల్ బ్లెస్ యూ!" అన్నాడు డేనియల్.

వరండాలోంచి నడచి మెట్లు దిగేందుకు లాండింగ్ వేపు వచ్చాను. అమెరికన్ నర్సు వచ్చి నిలుచుంది, అంతకు ముందుగానే అక్కడ. నన్ను చూసి నవ్వింది. నేనూ నవ్వాను నవ్వలేకపోయినా.

"వెళ్తున్నావా?" అడిగింది ఆమె.

"ఆఁ! నీకెలా తెలుసు?" అడిగాను.

"ఇందాక విన్నాను. తోడుగా వుంటాను. వచ్చేదా."

"అక్కర్లేదు!" అని ఆమెతో ఇంకా మాటలు పొడిగించడం అనవసరమనుకొని, మెట్లు దిగిపోయాను క్రిందికి.

నా కెవ్వరూ కనుపించలేదు. ఎవరిపనుల్లో వాళ్ళు వుండిపోయారేమో ననుకున్నాను.

బిల్డింగు దాటాను. నా మనస్సులోంచి అందరి గురించిన ఆలోచనలు అంతర్ధాన మయినాయి. ఒక్క జెల్లామాత్రం గుర్తుంది.

ఎటు వెళ్ళాలో, ఎక్కడ వెతకాలో, నిర్ధారణ లేకుండా అంతకుముందు మేమిద్దరం కలిసి తిరిగిన ప్రదేశాలన్నీ కలయతిరిగాను సాయంత్రందాకా. మునిమాపు చీకటి

చుట్టుముట్టే సమయానికి వచ్చి సముద్రపుటొడ్డున కూర్చు న్నాను.

డెల్లా పారిపోయి వారం కావస్తూంది.

ఇన్ని దినాలు తిండి తినకుండా వుండి వుండాలను కున్నాను. దాంతో బాగా నీరసపడిపోయి ఎక్కడో తిప్పల మధ్య స్పృహతప్పి పడిపోయిందా?

కాకుంటే, మతి స్థిమితంలేదు కాబట్టి బిల్డింగులోంచి తప్పుకున్నాక, తిన్నగా వచ్చి సముద్రంలోకి దూకి చని పోయి వుంటుందా?

ఈ రెంటికీ మించి మరోవిధంగా ఆమె అటు రిసెర్చి సెంటరువాళ్ళూ, ఇటు నేనూ వెతికినా కనుపించక పోవ టానికి వీలులేదని తోచింది.

అక్కడే ఇసుకలో వెల్లికింతలా పడుకున్నాను ఆకాశం కేసి చూస్తూ.

అసలు డెల్లాను బంధించివుంచగా కట్లు విప్పి, ఆమె అక్కడనుండి తప్పుకుపోయేట్లు చేసిందెవరాని ఆలో చించాను. నాకు అమెరికన్ నర్సు ఆ పని చేసివుండా లనిపించింది. ఆ మరుసటి దినం గదిలోకి వచ్చినప్పుడు ఆమె కళ్ళు ఎర్రగా వుండటం, నిద్ర పోలేదేమని అడిగి నప్పుడు సరయిన జవాబు చెప్పకపోవడంకూడా గుర్తొ చ్చింది.

ఆమె అంతకుముందు నాతో మాట్లాడిన విషయాలు కూడా గుర్తొచ్చాయి. డెల్లాను నాకు లేకుండా చేస్తే, నేను తనకు దగ్గరవుతానని అమెరికన్ నర్స్ భావించి వుంటుందని ఊహించాను. ఆమె అర్ధరాత్రి పూట డెల్లా కట్లు విప్పి, వెలుపలకు పంపించివేసి వుండాలనిపించింది.

ఆ అనుమానం రాగానే నాకు అమెరికన్ నర్సుపైన కోపం, పగ, పుట్టుకొచ్చాయి. ఆమె డెల్లాను వెలుపలకు మాత్రమే పంపిందా, లేక ఆమెతోగూడా కొంతదూరం పోయి, అక్కడే హతమార్చి గొయ్యితీసి పూడ్చి పెట్టిందా? అన్న సందేహంకూడా కలిగింది.

డెల్లా ఎటు వెళ్ళిందీ, ఎలా వెళ్ళిందీ తెలుసుకోవటానికి నర్సు సాయం చాలా అవసరమని తెల్సుకున్నాను. ఆమెను బెదరించి, నిజం కక్కించడం అసాధ్యమనికూడా ఊహించాను.

నా కింక మిగిలిం దొకేదా రనిపించింది.

ప్రేమించినట్లు నటించి, నాకు కావలసిన సమాచారాన్ని అమెరికన్ నర్సు దగ్గరనుంచి రాబట్టి, ఆ తర్వాత ఆమెపైని నా కక్ష తీర్చుకోవడం!

అదీ అంత సులభసాధ్యం గాదని తోచింది!

ఆ నర్సు జాణ!

మాట్లాడటంలోనూ, ఎదుటివాళ్ళను పుస్తకంలా చదవడంలోనూ, తన భావాలు బైటపడకుండా నిగ్రహశక్తి చూపడంలోనూ, ఆమె శక్తియుక్తులు అపారమని అంతదాకా నాకున్న అనుభవంతో నిర్ణయించుకున్నాను.

అయినా ప్రయత్నించక తప్పదు.

అలా ఆలోచిస్తూ పడుకున్నాను.

మెదడు కాస్త ఎక్కువ పనిచెయ్యడంవల్ల లోపల రక్తప్రసారం హెచ్చుస్థాయిలో జరిగి, నరాలు నొప్పి పెట్టాయి. కణతలు మండాయి. అరచేతుల్తో అదుముకున్నాను.

నా ప్రస్తుత ఆరోగ్యపరిస్థితికి అతిగా ఆలోచించడం

పనికిరాదని తెలుసు. అయినా మనస్సును అదుపులో పెట్టుకోలేనంత ఆవేదన, ఆవేశం, ఉద్వేగం, ఉద్రేకం గుండెల్లోంచి తన్నుకొస్తుంటే ఆపలేకపోయాను.

డెల్లా గుర్తొచ్చింది?

పాపం! ఎక్కడ తిరుగుతుందో? ఎలా వుందో? ఏం చేస్తూందో? నా ప్రయత్నం లేకుండానే కళ్ళు నీళ్ళతో తడిసిపోయాయి. ఆమె మనస్సు పట్టు తప్పి, పిచ్చెక్కి వుంటుంది. ఆ పరిస్థితుల్లో వెలుపలకి వెళ్ళిన ఆమె ఏదైనా అఘాయిత్యం చేసుకుంటుందా?

సముద్రంలోకి దూకి చావచ్చు!

ఏ రాతికో తల బాదుకొని మరణాన్ని కౌగలించుకో వచ్చు!!

తిండీ తిప్పలూ లేకుండా పడుండి మృత్యువు ఒడిలో చోటు సంపాదించుకోవచ్చు!!!

డెల్లా చనిపోతుందన్న భావన, చనిపోయి వుంటుం దేమోనన్న ఊహ, నాకు ఊపిరి ఆడకుండా చేస్తున్నాయి.

ఎక్కడో గుండెల మూలల్లో అలా జరగదన్న గ్రుడ్డి నమ్మకం, కొడిగట్టిన వొత్తిలా వెలుగుతూనే వుంది.

నర్స్ ఆజానుబాహు విగ్రహం మళ్ళా గుర్తొచ్చింది' అంతకు ముందంతా, ఆమెలో సేవాభావాన్నీ సహన శీలాన్నీ, కారుణ్యరూపాన్ని మాత్రమే చూడగలిగిన నాకు, ఇప్పుడు పైశాచికత్వం, రాక్షసత్వం, ద్వేషానలం మాత్రమే కనుపించసాగాయి.

ఆమె రాకకోసం ఎదురుచూస్తూ పడుకున్నాను. అలా ఎంతసేపు పడున్నానో నాకే తెలీదు. కళ్ళుమాత్రం మూసుకున్నాను. చెవులతో అడుగుల చప్పుడుకోసం

రిక్కించి ఎదురుచూడసాగాను.

చాలాసేపటి తర్వాత ఏదో అలికిడి లీలగా వినిపించింది. మెల్లగా కళ్ళు తెరచాను.

ఎవరో నా మంచం దగ్గరకు నడచుకుంటూ వస్తున్నట్లు తోచింది.

అమెరికన్ నర్సేమో ననుకున్నాను.

అడుగుల సవ్వడి ఆగిపోయింది.

తల త్రిప్పిచూశాను.

నర్స్ కనిపించింది. కానీ ఆమె నేనంతదాకా ఎదురు చూసిన అమెరికన్ నర్స్ కాదు. పొట్టిగా, లావుగా వుండే రెండో నర్స్.

"ఎలా వుంది?" అడిగింది నన్ను.

"బాగానే వుంది? నువ్వొచ్చావేం?" అడిగాను.

"ఏం రాకూడదా?" అడిగిందామె థర్మామీటరు గాలిలో విసురుగా విదిలిస్తూ.

"అలాని కాదు! మామూలుగా వచ్చేది నువ్వు కాదు గదా అని...అడిగాను!" అన్నాను.

"ఆమెకూ డాక్టరుకూ గొడవయింది" నోటిదగ్గర బెడుతూ అంది. మాట్లాడడానికి వీలులేకుండా, తెరచిన నా నోట్లో ఆమె థర్మామీటరు పెట్టేసింది. అది ఇటూ, అటూ జరక్కుండా పెదాలు మూసి బిగించాను.

ఒకనిముషం తర్వాత, దాన్ని వెలికితీసింది నర్స్. వెలుతురు కెదురుగాబెట్టి, తల కొద్దిగా పైకెత్తి చూడ సాగింది.

"నార్మల్ గా వుంది!" అంది, సీసాలో పెడుతూ.

అవును. టెంపరేచర్ నార్మల్ గానే వుంది. కానీ

మనసుమాత్రం కాదు. అందులో రేగుతున్న పెను తుఫానులు, రగులుతున్న ప్రతీకార జ్వాలలు, కలుగుతున్న సందేహాలు ఆ మీటరులో రికార్డు కావు.

"నర్స్!" పిలిచాను మెల్లిగా.

ఆమె నాకేసి చూసింది.

"నువ్వు చాలా మంచిదానివి!" అయాచితంగానే కామెంట్ చేశాను.

"ఎందుకని? అయినా నా మంచిచెడ్డలతో మీకేం అవసరం?" అడిగింది ఏవో టాబ్లెట్లు తీస్తూ.

"నువ్వు నీ ఆనందం మాత్రం కోరుకుంటావు. అవతలి వాళ్ళ మనస్సును కష్టపెట్టవు. కానీ నీతో వుండే ఆ పొడవుపాటి అమెరికన్ నర్స్ అలాంటిది కాదు!" ఎందుకో ఈమెకు చెప్పుకోవాలనిపించింది నా మనస్సులోని బాధ. ఈమె ఆరుస్తుందన్న ఆశ లేదు. తీరుస్తుందన్న కోరికా లేదు.

"ఆమేం చేసింది?" అడిగింది టాబ్లెట్లు అందించి.

ఆ మాత్రలు గొంతులో వేసుకున్నాను.

గ్లాసులో నీళ్ళిచ్చింది నర్సు.

నీళ్ళు త్రాగి గ్లాసు తిరిగి ఇచ్చేశాను. దాన్ని తీసి టీపాయ్‌పైన పెట్టింది.

"నా ప్రశ్నకు మీరు జవాబు చెప్పలేదు" గుర్తుచేసింది నర్స్.

"ఆమె నా గురించీ, నా భార్య డెల్లా గురించి వచ్చినప్పుడల్లా ప్రశ్నలు వేసేది. అన్నింటికీ జవాబులు చెప్పాను. నన్ను బహుశా అమెరికన్ నర్స్ ప్రేమించి వుండాలి. అలాంటి అభిప్రాయం ఆమెలో వున్నట్లు కని

పెట్టాను. ఆమెకు నేను దక్కనన్న అనుమానం కలిగి నట్లుంది. నా భార్యను నాకు కాకుండా చేస్తే, నేను ఆమెకు దక్కుతానని అనుకుంది" చెప్పటం ఆపాను.

"అవన్నీ ఆమే చెప్పిందా?"

"లేదు! నేను ఊహించాను."

"ఆ తర్వాత..."

"డెల్లాకు మతి చెడిపోయి వుంది. ఆమెను గదిలో పెట్టి బంధించారు. డాక్టరు ఎంతో జాగ్రత్తగా ఆమెకు చికిత్స చేస్తున్న విషయం నాకు తెలుసు. కానీ ఉన్నట్లుండి కట్లు తెంచుకుని, తలుపులు తీసుకుని డెల్లా పారిపోయిం దని తెలుసుకున్నాను". ఆమెవంక చూశాను. ఆమె ముఖం ప్రక్కకు త్రిప్పుకుంది.

"ఎలా తెలుసుకున్నారు?" అడిగింది నర్స్.

"తెలుసుకోవాలన్న పట్టుదలతో వున్న నాకు, అది సాధించటం పెద్ద కష్టంకాదు సిస్టర్. కానీ ఈ విషయం గురించి నాకు తెలియనియ్యలేదెవ్వరూ కొద్ది దినాలు. అడిగినప్పుడల్లా ఆమె కోలుకుంటుందనో, పరిస్థితి మెరు గయిందనో, మామూలు పరిస్థితికి త్వరలో రాబోతూందనో చెప్పటం మొదలెట్టారు. మంచంలోంచి పైకిలేవని స్థితిలో నమ్మాను" అంటూ ఆ తర్వాత జరిగిందంతా పూసగ్రుచ్చి నట్లు చెప్పాను ఆమెకు.

అంతా విన్నాక ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

"దీనికంతా అమెరికన్ నర్స్ కారణమని ఎందుకు ఊహించారు?" అడిగింది.

"డాక్టరుగారి మాటల్లో తలుపులు వెలుపలనుండి మూసి తాళం వేసినట్లు చెప్పారు. లోపలున్న డెల్లాను

త్రాళ్ళతో కట్టివేసినట్లు చెప్పారు. తలుపులు ఎవరో తీసి, ఆమె కట్లు విప్పి, వెలుపలకు తరిమివేశారు. లేకుంటే ఆమెకై ఆమే వెళ్ళిపోయే అవకాశం లేదు” అన్నాను నాకు తెలిసిన లాజిక్ మొత్తం ఉపయోగించి.

“ఆ చేసింది ఆమేనన్న మీ అభిప్రాయంతో ఏకీభవిం చేందుకు మీరు చెప్పిందాంట్లో ఏమీ లేదు!” అందామె.

“ఇక్కడ వున్న అందరిలో డెల్లా విషయంలో కలుగ జేసుకోనే అవసరం ఎవ్వరికీ లేదు! ఆమెకు తప్ప” అన్నాను.

“మీరో విషయం మరచిపోతున్నారు. డెల్లా మంచి చెడ్డలు చూసే బాధ్యత డాక్టరుగారు నాకు అప్పగించారు. ఆమె నా కస్టడీలోనే వుండింది. ఆమెను నేనే తప్పించి వుండవచ్చుగా?” అడిగింది ఆమె సీరియస్‌గా.

“అయితే నువ్వే తప్పించావా?” అడిగాను ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ.

“లేదు!” అందామె.

“ఆ విషయం తెలుసు నాకు. ఆ వేళప్పుడు నువ్వు ఎక్కడ ఎవరితో వుంటావో కూడా నాకు తెలుసు. అందువల్లే నిన్ను అనుమానించలేకపోయాను. ఆ అమెరికన్ నర్స్ నన్ను ఎలాగైనా తనవాణ్ణి చేసుకోవాలనుకుంది. అందుకే ఇంత దారుణం జేసింది” అన్నాను.

డాక్టర్ లోనికి వచ్చాడు.

“నీ కోసం చాలాసేపు ఎదురుచూస్తూ కూర్చున్నాను. ఇంతసేపు ఏంచేస్తున్నావ్ ఇక్కడ?” అడిగాడు నన్ను.

“ఆమె వెళ్ళాలంటూనే వుండింది. నేనే మాటలు పెట్టుకొన్నాను. ఆమె ఆలస్యానికి కారణం నేనే. క్షమిం

చండి!" అన్నాను డాక్టరుతో.

"దట్స్ ఆల్ రైట్! హౌ ఈజ్ హి!" అడిగాడు డాక్టరు నర్సును.

ఆమె చకచక చెప్పుకుపోయింది.

అంతా ఓపిగ్గా విన్నాడు డాక్టరు, తల వూపుతూ.

ఆ తర్వాత నర్స్‌కేసి చూసి "నువ్వెళ్ళు!" అన్నాడు.

నర్స్ నాకేసి చూసి, ఆమె కిట్ సర్దుకుని గదిలోంచి వెళ్ళిపోయింది.

"నువ్వు డెల్లాను గురించి బాగా అప్సెట్ అవుతున్నట్లున్నావు. అవునా?" అడిగాడు డాక్టరు మంచం వారగా కూర్చుని.

"అవును!" అన్నాను.

"ఎంత చెప్పినా వినిపించుకోకుండా, ఈ దీవిలో చాలాదూరం ఎండలో తిరిగావట!"

"అవును సార్!"

"నేను నిన్ను మనిషిని చెయ్యడానికి అహోరాత్రులు కృషిచేశాను. మృత్యువుతో పోరాడాను. కానీ, నీ అజాగ్రత్తవల్ల అప్రమత్తంగా వుండకపోవటంవల్ల, మళ్ళీ మృత్యువు కోరల్లోకి నీకు నువ్వే చిక్కుకోనదలచుకున్నావా?" అడిగాడు డాక్టరు తీవ్రంగా.

"లేదు సార్!" అన్నాను.

"మిస్టర్ రాజ్! నీకు డెల్లాపైనున్న ప్రేమ, అనురాగం, అభిమానం నాకు తెలుసు. ఆమె మా అజాగ్రత్త వల్లనే తప్పించుకొని వెళ్ళింది. వెతికిస్తున్నాం. ఇవాళ గాకుంటే రేపైనా దొరుకుతుంది. ఇంతలోపలే నువ్వు

ఆవేశపడి, ఉద్రిక్తుడివై, తిరిగితే ఆమె దొరుకుతుందా? నువ్వు స్పృహతప్పి పడిపోయి వున్న స్థితిలో ఇక్కడికి తీసుకొచ్చాను. ఇరవై ఆరుగంటలకు పైగా నువ్వు అచేతనంగా పడివున్నావ్. మెదడులో నరాలన్నీ బాగా కలసిపోయి వున్నాయి. ఆలోచనలు మానెయ్యాలి. ఆహారం బాగా తీసుకోవాలి. విశ్రాంతి అవసరం ఇప్పుడు'' చెప్పాడు డాక్టరు.

నాకేం జరిగిందో ఇంతదాకా తెలీలేదు.

డాక్టరు చెప్పాక అర్థమయింది. ముందు నమ్మలేకపోయాను. నేను డెల్లాను వెతుక్కుంటూ వెళ్ళడం, అక్కడంతా తిరగడం లీలగా గుర్తొచ్చింది.

ఆయన నాకేసి సూటిగా చూస్తున్నాడు.

ఆయన చూపుల్లో చూపులు కలపలేకపోయాను. తల ప్రక్కకు తిప్పుకున్నాను.

''రాజ్!'' ఆయన పిలిచిన పిలుపు చాలా ఆర్ద్రంగా, ఆప్యాయంగా వినిపించింది.

తల త్రిప్పి చూశాను.

''నాకు మాటివ్వాలి!'' అన్నాడు.

''ఏమని సార్? ఆలోచించననా? అది సాధ్యమవుతుందా? డెల్లా నా కళ్ళముందు మెదలుతూనే వుంది. ఆమెకోసం నా హృదయం తపించిపోతూంది. ఎక్కడుందో, ఎలా వుందో? ఏ పరిస్థితుల్లో వుందోనన్న ఆందోళన గుండెను పిండివేస్తూంటే, ఏమీ పట్టనట్లు, కనీసం ఆమెగురించి ఆలోచించకుండా కూడా వుండలేను సార్!'' అన్నాను ఏడుస్తూనే.

"అలా బెంబేలుపడకు! ఆమెను నేను తీసుకొస్తాను. నీకు విశ్రాంతి కావాలి. మత్తుమందన్నా ఇచ్చి నీకు చైతన్యం లేకుండా చెయ్యవలసి వచ్చేట్లుంది" అన్నాడు డాక్టరు.

నాకు భయం పుట్టింది.

మత్తుమందిచ్చాక, ఆ మత్తులోంచి తిరిగి తేరుకుని చైతన్యంలోకి రాగలుగుతానో లేదోనన్న సందేహం కలిగింది. ఆయన ప్రయత్నాన్ని ఎలాగైనా ఆపాలనుకున్నాను.

"మీరు చెప్పినట్లే వుంటాను. నాకు మత్తుమందు వద్దు సార్!" అన్నాను దీనంగా.

"నువ్వుండలేవు. అదీగాక మా కళ్ళు కప్పి మళ్ళా వెళ్ళిపోయే ప్రమాదం కూడా వుంది. అందువల్ల నా నిర్ణయం అమలు జరపడమే మంచిదనుకుంటున్నాను" అన్నాడు డాక్టరు.

డాక్టరుగారిని ఆ తర్వాత చాలా రకాలుగా బ్రతిమలాడాను. ఆయన వినిపించుకోలేదు. అంతకుముందు వచ్చి వెళ్ళిన నర్సును తీసుకొచ్చాడు. ఏదో ఇంజక్షను లోడ్ చేశాడు. నాకు రకరకాల ధైర్యం చెపుతూనే, సిరంజివున్న నీడిల్ శరీరంలో గ్రుచ్చాడు.

(సశేషం)